
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

● ప్రధాన న్యాయాధికారి కబర్ధి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి

కర్నూలు లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి పోలీసు అధికారులను సూచించారు. మంగళవారం స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పోలీసు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీకి వీలున్న క్రిమినల్, ఎక్సైజ్ కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కేసుల పరిష్కారానికి కక్షిదారులను సంప్రదించి రాజీకి వీలున్న కేసులను లోక్‌అదాలత్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులే గాక.. ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించు కోవచ్చని కోర్టు మానిటరింగ్ పోలీసులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. పోక్సో కోర్టు న్యాయాధికారి రాజేంద్రబాబు, న్యాయాధికారులు అనిల్‌కుమార్, అపర్ణ, అనూష, పత్తికొండ, ఆళ్లగడ్డ డీఎస్పీలు వెంకట్రామయ్య, ప్రమోద్‌కుమార్, కర్నూల దిశా పీఎస్ సీఐ రామానాయుడు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌తో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.5.41 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం శ్రీమఠం చరిత్రలో రికార్డు స్థాయిలో మొదటిసారిగా అధికమొత్తంలో రూ.5,41,47,228 నగదు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతిఆచార్ తెలిపారు. అక్టోబరు, నవంబరు నెలల్లో 34 రోజుల్లో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమరాల నిఘా మధ్య మంగళవారం లెక్కించారు. రూ.5,41,47,228 నగదుతో పాటు 1610 గ్రాముల వెండి, 80 గ్రాములు బంగారు, విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు చెప్పారు. వచ్చిన నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ నోట్లను ఇంకా లెక్కించలేదని చెప్పారు. పెద్దమొత్తంలో హుండీ ఆదాయం చేకూరడంతో శ్రీమఠం అధికారులు, ఉద్యోగులు సయన్వయంతో భక్తులకు సమష్టిగా సేవలు అందించడంతో సాధ్యమైందని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సిబ్బందిని అభినందించారు. ఈ హుండీ లెక్కింపులో అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, అనంత పురాణిక్, జేపీస్వామి, కృష్ణమూర్తి, దేశాయ్ నరసింహమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

సర్వం సిద్ధం..!



రైతులకు అండగా రెండో విడతగా పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ నిధుల పంపిణీకి జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా రెండో విడత కింద 3.89 లక్షల మంది రైతులకు రూ.139.71కోట్ల లబ్ధి చేకూరనుంది. దీంతో ఆయా వర్గాలు ఆనందంతో ఉన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద జిల్లాలో 2,06,052 మంది రైతులకు రూ.103.03 కోట్లు, పీఎం కిసాన్ కింద 1,83,543 మందికి రూ.36.68 కోట్లు జమ చేయనున్నారు. ఇది రైతులకు ఆర్థికంగా ఊరట కలిగించనుంది.

- ● రైతులకు అండగా పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ
- ● నేడు రెండో విడత నిధులు జమ
- ● 3.89 లక్షల రైతులు.. రూ. 139.71 కోట్ల లబ్ధి
- ● చెక్కులు పంపిణీ చేయనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- ● ఆనందంలో అన్నదాతలు

నంద్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల వారిగా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆ దిశగా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. బుధవారం పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు జమ కానుండటంతో జిల్లాలో సందడి మయంగా మారినట్లైంది.

రైతులకు అండగా...

ఎన్నోన్నో కష్టాలతో పాటు ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆయా బాధితులకు ప్రభుత్వం పరిహారం కూడా ఇవ్వనుంది. ఇదే తరుణంలో తాజాగా నేడు కూటమి ప్రభుత్వంలో అమలు చేస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లా వ్యాప్తంగా 3,89,595 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.7వేలు చొప్పున మొత్తంగా రూ.139.71కోట్లు జమ చేయనున్నారు. తద్వారా ఆయా రైతులకు ఆర్థికంగా అండగా నిలిచినట్లైంది.

మంత్రులు, ఎమ్మెల్యేలు..

పీఎం కిసాన్., అన్నదాత సుఖీభవ రెండో విడత చెక్కుల పంపిణీలో భాగంగా జిల్లాలోని నియోజకవర్గాల వారిగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం హాజరై చెక్కులు పంపిణీ చేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ కూడా జిల్లాకు రానున్నారు. ఈయన డోన్ నియోజకవర్గం బేతంచెర్ల మండలం ఎంబాయి గ్రామంలో నిర్వహించే చెక్కుల పంపిణీకి హాజరవుతారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సైతం గోస్పాడు మండలంలోని జిల్లెల్లలో నిర్వహించే కార్యక్రమానికి హాజరవుతారు. రెండు పథకాల కింద లబ్ధి పొందుతున్న రైతులు ఆనందంలో ఉన్నారు.

కౌలు రైతుల్లో ఉత్కంఠ

జిల్లాలో సుమారు 16,500మంది కౌలు రైతులు ఉన్నట్లు ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. ఎన్నికల సమయంలో కౌలు రైతుల పరంగా కేంద్రం పీఎం కిసాన్‌పై ఎలాంటి ప్రకటనలు చేయలేదు. కూటమి ప్రభుత్వం మాత్రం కౌలురైతులకు కూడా అన్నదాత సుఖీభవ ఇస్తామని ప్రకటించారు. మొదట విడతలో కౌలు రైతులకు మంజూరు చేయలేదు. తాజాగా నేడు అందించే అన్నదాత సుఖీభవ కింద కూడా ఎలాంటి లబ్ధి చేకూరలేదు. అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 16,500మంది దరఖాస్తు చేసుకున్నారని తెలుస్తోంది. వీటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించి వచ్చే విడతలో అన్నదాత సుఖీభవ అర్హులైన కౌలు రైతులకు అందించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోందని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది.

రైతులకు ఆర్థికంగా ఊరట

పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ కింద రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థికసాయం రైతులకు ఊరట కలిగించే అంశం. మొంథా తుఫాన్ నేపథ్యంలో నష్టపోయిన రైతులకు కూడా పరిహారం అందించేలా ప్రభుత్వానికి నివేదిక నివేదించాం. కౌలు రైతుల విషయంలో స్పష్టత లేదు.

– రాజకుమారి, కలెక్టర్, నంద్యాల

జిల్లాలో పరిస్థితి ఇలా...

● అన్నదాత సుఖీభవ కింద రైతులు	: 2,06,052 మంది
● పీఎం కిసాన్ కింద రైతులు	: 1,83,543 మంది
● అన్నదాత సుఖీభవ నిధులు	: రూ. 103.03 కోట్లు
● పీఎం కిసాన్ నిధులు	: రూ. 36.68 కోట్లు
● రెండు పథకాల కింద రైతులు	: 3,89,595 మంది
● రెండు పథకాల కింద అందించే నిధులు	: రూ. 139.71 కోట్లు



అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల, నూనెపల్లి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హౌసింగ్ కొత్త స్కీమ్ గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి తహసీల్దార్లకు సూచించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం తహసీల్దారులతో పలు రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూరల్ పరిధిలో ఉండే లబ్ధిదారులకు 3 సెంట్లు, అర్బన్ పరిధిలోని లబ్ధిదారులకు 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయించనున్నట్లు తెలిపారు. జిల్లాలో భూ సమస్యలపై రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. పట్టా భూములను 22ఏలో చేర్చడానికి వీలు లేదని.. అలా ఎక్కడైనా జరిగినట్లయితే వెంటనే తొలగించాలన్నారు. ఇకనుంచి కార్యాలయపు ఫైళ్లన్నీ సంబంధిత అధికారుల ఈ సైన్‌తో ఈ ఆఫీస్ ద్వారానే తమకు సమర్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలకు వచ్చిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి అర్హులందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. పీజీఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో రామునాయక్, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్



మాట్లాడుతున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య కోరారు. ఆదోని జేబీ గార్డెన్‌లో మంగళవారం రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనాన్ని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ క్వింటం పత్తికి రూ. 12 వేలు చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో క్వింటానికి రూ.3 వేలు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీసీఐ 11 కింటాళ్లు కొంటామని మాట ఇచ్చి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం దారుణమని అన్నారు. రైతు ప్రయోజనాలను సీసీఐ దెబ్బతీస్తూ కార్పోరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ గతంలో ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, గుంతకల్లు, కడపలో స్పిన్నింగ్ మిల్లులు ఉండేవని, అయితే నేడు ఆదరణ లేక మూతపడ్డాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయింపులో ప్రభుత్వం వివక్ష చూపడం వల్ల రాయలసీమ రైతులు వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్, సిద్ధేశ్వరం, గండికోట ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. టమోటా, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పత్తి గ్రేడింగ్ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తే వ్యవసాయ రంగం బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, పంపన్న గౌడ్, వీరేష్, సురద్యన్ రాజు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే లక్ష్యం

● ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ విశాఖ రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో 613 ఒప్పందాలు, రూ.13.25లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో జరిగిన సీఐఐ సదస్సు సూపర్ సక్సెస్ అయిందన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో నమ్మకమైన సంస్థలు భారీఎత్తున పెట్టుబడులు పెట్టడంతో ఏపీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, పవన్‌కళ్యాణ్, ఇతర మంత్రులు జాతీయస్థాయిలో పెట్టుబడులు ఆకర్షించేందుకు రోడ్డుషోలు నిర్వహించామన్నారు. పెట్టుబడుల శాఖామంత్రిగా తాను సీఎం సూచనలతో దుబాయ్, సౌత్ కొరియాలో పర్యటించడం అక్కడ రోడ్‌షోలో పాల్గొని అనేక కంపెనీలను ఒప్పించామన్నారు. రాష్ట్ర సుస్థిరత కోసం తపించే కూటమి ప్రభుత్వం దీర్ఘకాలం పాటు అధికారంలో ఉంటుందన్నారు. ఉపసర్పంచ్ బురానుద్దీన్, భానుముక్కల సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ కలాం, బనగానపల్లె మార్కెట్‌యార్డు డైరక్టర్ గండం మల్లికార్జునరెడ్డి, బనగానపల్లె ఆస్పత్రి కమిటీ సభ్యుడు అహ్మద్‌హుసేన్, టీడీపీ నాయకుడు మంచాల మద్దిలేటిరెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● డీఈవో జనార్దన్‌రెడ్డి



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

దొర్నిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు తరగతి గదిలో విద్యాబోధనపై పలు ప్రశ్నలు అడిగారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవోలు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, సిబ్బంది ఉన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు విడుదల

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు(అడ్మిట్‌కార్డ్స్) విడుదలైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ డిసెంబర్13న శనివారం ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు. నేటి నుంచి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే విద్యాలయాన్ని సందర్శించి సమాచారం తెలుసుకోవాలన్నారు.

నేడు శ్రీశైలం ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇది రెండో సమావేశమని చెప్పారు. సభ్యులందరూ హాజరవుతారని ఆయన తెలిపారు.

లారీ ఢీకొని ముగ్గురి దుర్మరణం

● ఒకరికి గాయాలు ● కర్నూలులో నగరంలో ఘటన

7

సర్వం కోల్పోయాం

- ● కేంద్ర బృందంతో ఉల్లి రైతుల ఆవేదన
- ● ప్యాలకుర్తిలో అర గంట.. గోనెగండ్లలో ఐదు నిమిషాలు
- ● ఇదీ కేంద్ర బృందం పర్యటన తీరు



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

కర్నూలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 ఖరీఫ్‌లో 45,278 హెక్టార్లలో రైతులు ఉల్లి సాగు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లి సాగు చేసే జిల్లాల్లో కర్నూలు ఒకటి. ప్రధానంగా సి.బెళగల్, కోడుమూరు, గోనెగండ్ల, దేవనకొండ, ఆదోని, కోసిగి, ఎమ్మిగనూరు, పత్తికొండ, తుగ్గలి మండలాల్లో ఉల్లి సాగు అధికంగా చేస్తున్నారు. బోరుబావుల కిందే కాకుండా వర్షాధారంగా కూడా సాగు చేస్తున్నారు. ఆగస్టు ఆఖరు నుంచే పంట కోతకు వస్తుంది. అయితే.. పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు ఉల్లి రైతులను కోలుకోని దెబ్బతీశాయి. అరకొర పంటను మార్కెట్‌కు తీసుకొస్తే పతనమైన ధరలు అప్పుల ఊబిలోకి నెట్టేశాయి. అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని దైన్యపరిస్థితుల్లో రైతులు కుదేలయ్యారు. కష్టకాలంలో అండగా మేమున్నామంటూ కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 కనీస మద్దతు ధర ప్రకటించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేపట్టింది. ఏపీ మార్క్‌ఫెడ్, లైసెన్సుడ్ వ్యాపారులు 2,800 మంది రైతుల నుంచి దాదాపుగా 1.55 లక్షల క్వింటాళ్ల ఉల్లి సేకరించారు. రైతులకు రూ.17 కోట్లు చెల్లించాల్సి ఉంది. వారం పది రోజుల్లోగా ఖాతాల జమ చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. రెండు నెలలు గడిచినా మెజార్టీ రైతులకు ఉల్లి డబ్బులు ఏపీ మార్క్‌ఫెడ్ ఇవ్వలేదని రైతులు అంటున్నారు. అదే క్రమంలో హెక్టారుకు రూ.50 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇంత వరకు ఆ దిశగా చర్యలు శూన్యం.

అప్పుల ఊబిలో కూరుకుపోయాం..

జిల్లాలో ఉల్లి రైతుల కన్నీటి కష్టాలు క్షేత్రస్థాయిలో చూసి, ప్రభుత్వాలకు నివేదిక ఇచ్చేందుకు కేంద్ర బృందం సభ్యులు కేంద్ర ఉద్యానవన మంత్రిత్వ శాఖ డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మ, అండర్ సెక్రెటరీ మనోజ్, డిప్యూటీ డైరెక్టర్ రాజీవ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ హేమాంగ్ భార్గవ్, సెంట్రల్ హెడ్ శరవణన్‌ల బృందం బుధవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి, గోనెగండ్ల మండలం గాజులదిన్నె, గోనెగండ్లలో ఉల్లి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కేంద్ర బృందం ఏ ఉల్లి రైతును కదిపినా కన్నీటి సుడులే. 'అయ్యా..! ఎన్నో ఆశలతో ఉల్లి సాగు చేస్తే కన్నీళ్లు పెట్టించింది. ఒక ఏడాది లాభం వస్తే.. మూడేళ్లు నష్టపోతున్నాం. ఈ ఏడాది అధిక వర్షాలకు దిగుబడి భారీగా తగ్గిపోయింది. అరకొర దిగుబడిని మార్కెట్‌కు తీసుకెళితే ధరలు పతనమై అప్పుల ఊబిలోకి కూరుకుపోయాం. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధర రూ.1,200కు కొనుగోలు చేసి కొంత ఊపిరి పోసినా, ఆ ధర కూడా గిట్టుబాటు కాలేదు. కనీస మద్దతు ధర రూ.2 వేలు కేంద్రం ప్రకటించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల'ని విన్నవించారు. ఈ ఏడాది ఎకరాకు ఉల్లి సాగుకు రూ.లక్షకు పైగా ఖర్చు చేశామనీ, . కేంద్ర ప్రభుత్వం ఆదుకునేలా నివేదిక ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హెక్టారుకు రూ.50 వేలు ఆర్థిక సాయం తక్షణమే ఇచ్చేలా చూడాలని కోరారు.

మిగతా 7వ పేజీలో

మహానందిలో భక్తుల సందడి



నాగులకట్ట వద్ద కార్తీక దీపాలు వెలిగిసున్న భక్తులు

మహానంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం వందలాది మంది భక్తులు సందడి చేశారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరుల్లో పుణ్య స్నానాలను ఆచరించారు. ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లోని నాగులకట్టతో పాటు ధ్వజస్తంభం వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం వచ్చినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

తెల్లపొడ మచ్చలు గుర్తించాలి

నందికొట్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి తిరిగి తెల్లపొడ మచ్చలు ఉంటే గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్ రావు తెలిపారు. మంగళవారం పగిడ్యాల, నందికొట్కూరు ప్రాతకోట గ్రామాల్లో సర్వేను ఆయన పరిశీలించారు. కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తూ, అనుమానపు, స్పర్శ లేని మచ్చలు ఉంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్ కుమార్, డాక్టర్ పూజారాణి, గ్రామ సచివాలయాల హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వాతి వేడుకలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నంద్యాల రూరల్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కో ఆపరేటివ్ అధికారి రామంజనేయులు అన్నారు. కో ఆపరేటివ్ సొసైటీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కోవెలకుంట్ల కో ఆపరేటివ్ బ్యాంకు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డివిజనల్ అధికారి రుక్సానా, సీఈవో కృష్ణమూర్తి, మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు, సర్వేల్లో పురోగతి సాధించాలి



సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నంద్యాల టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పన్నులు, సర్వేలలో పురోగతి సాధించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి పుర సేవా యాప్, వాట్సాప్ గవర్నెన్స్ గురించి అవగాహక కల్పించాలన్నారు. సిబ్బంది సమయానికి హాజరుకావాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా పని చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి

నందికొట్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి అని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్మరి నాగరాజు అన్నారు. మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీరనారిని విద్యార్థినులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రవిద్యార్థి సంఘం నాయకులు చందు, గోవిందు, తరుణ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

'బీజేపీ హయాంలోనే దళితులపై దాడులు'

నందికొట్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హయాంలోనే దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురామ్మూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం మంగళవారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో పట్టణ సమితి కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సంఘ్ పరివార్ కనుసన్నల్లో రాజ్యాంగ లౌకిక ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, రాముడు, రవికుమార్, మాలిక్, వాసవి శ్రీనివాసులు, షేక్షావలి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి

నంద్యాల హాస్పిటల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14, 17బాల, బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు ప్రతిభ కనబరచి చాంపియన్లుగా నిలవాలని గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, ఏపీఎస్‌పీఈ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏపీరెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి సి.నాగేంద్ర, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు విశ్వనాథ్, ఆశాజ్యోతి పాల్గొన్నారు. కాగా, బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించి ఉమ్మడి జిల్లా కీర్తిపతాకాన్ని ఎగురవేశాయి. క్రీడాకారులను సన్మానించారు.

'విద్యార్థుల ఆరోగ్యంపై బాధ్యత లేదా'?

నంద్యాల నూనెపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల బొమ్మలసత్రంలోని ప్రభుత్వ ఎస్సీ 1, 2, ఎస్టీ బాలుర హాస్టళ్ల విద్యార్థుల ఆరోగ్యంపై అధికారులకు బాధ్యత లేదా అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ ప్రశ్నించారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆ వసతిగృహాలను పరిశీలించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శశిధర్‌రెడ్డి, ప్రవీణ్, నాయకులు మతేశ్, సూరి పాల్గొన్నారు.

అదనపు చార్జీలు రద్దు చేయాలి

ఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు ట్రూ ఆప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సద్దాం హుసేన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సౌర విద్యుత్ పేరుతో దళితులు, ఉద్యోగుల ఇళ్లకు షాపులకు సోలార్ బిగించి అదానీ, శిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌కు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి ప్రజలపైన ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో రూ.12717 కోట్ల భారాన్ని మోపడానికి ఈఆర్‌సీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పెడుతున్నారని ఆరోపించారు. విద్యుత్ భారాలను, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు.

కొలను భారతి అభివృద్ధిపై దృష్టి

- ఎమ్మెల్యే జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని సరస్వతి అమ్మవారి క్షేత్రానికి ధీటుగా కొలను భారతిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తెలిపారు. మంగళవారం కొత్తపల్లిలోని సరస్వతి పాఠశాల ఆవరణలో మాజీ కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన టీడీపీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొలనుభారతి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని శ్రీశైలం దేవస్థానంలో విలీనం చేశామని, త్వరలోనే శ్రీశైల దేవదాయ శాఖ అధికారులు క్షేత్రాన్ని స్వాధీనం చేసుకుంటారన్నారు. అలాగే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయనీ.. వర్గ విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేయాలనీ ఆదేశించారు. నేడు అన్నదాత సుఖీభవ కింద అర్హులైన రైతులందరికీ వారి ఖాతాల్లో రూ.7వేలు జమ చేయనున్నట్లు చెప్పారు. అలాగే మండలంలో వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు కూడా చేపడుతామన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, సర్పంచులు చంద్రశేఖర్ యాదవ్, నక్క విజయకుమార్, నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారిగా ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం భవనంలో ఈవోఆర్డీ సుబ్బారావు అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. 46 వినతిపత్రాలను ఎమ్మెల్యే స్వీకరించి త్వరలోనే వీటన్నింటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ, స్థానిక సర్పంచులు లక్ష్మిదేవి, చంద్రశేఖర్ యాదవ్, ఏపీవో విమలమ్మ, ఎంఈవో-1 నాగరాజు, ఏవో అమీరున్నిసా భేగం, హౌసింగ్ ఏఈ పాండురంగ నాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన



మహానందిలో లక్షబిల్వార్చన చేస్తున్న వేదపండితులు



బ్రహ్మానందీశ్వరాలయంలో లక్ష బిల్వార్చన

మహానంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది శైవ క్షేత్రంలో కార్తీక మాసం ముగింపు పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో ఘనంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులతో పాటు ప్రత్యేక రుత్వీకులు ఉదయం నుంచి ఆలయంలో గణపతిపూజ, గోపూజ చేశారు. సాయంకాలం నుంచి ప్రధాన శివాలయం ఆవరణలో లక్ష బిల్వదళాలతో అర్చన జరిపారు. కార్యక్రమంలో ఏఈవో మధు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కామేశ్వరీదేవికి లక్ష కుంకుమార్చన

కార్తీక అమావాస్య పురస్కరించుకొని బుధవారం మహానందిలోని కామేశ్వరీదేవి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను నిర్వహిస్తున్నట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు శాంతి కల్యాణం నిర్వహించడంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

నంద్యాల కల్చరల్: పట్టణంలోని బ్రహ్మానందీశ్వరాలయంలో మంగళవారం కార్తీకమాసం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి లక్షకుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. సంజీవనగర్ రామాలయంలోని కాశీవిశ్వేశ్వరునికి సామూహిక లక్ష బిల్వార్చన భగవత్ సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈవో లక్ష్మీనారాయణ, అర్చకులు మురళీక్రిష్ణ శర్మ, కృష్ణగిరి సురేష్‌శర్మ, భక్తులు, పాల్గొన్నారు. సాయంత్రం బ్రహ్మానందీశ్వరస్వామి ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

మల్లన్నకు మాసశివరాత్రి పూజలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

శ్రీశైలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున పరమశివునికి శాస్త్రోక్త పూజలు చేశారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వాభిషేక పుష్పార్చనలు జరిపించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామికి పంచామృతాభిషేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు బయలు వీరభద్రస్వామికి వీరశైవ ఖడ్గాలతో సాంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించిన తరువాత నంది మండపంలో గల నందీశ్వరునికి అభిషేకాలు, పుష్పార్చనలు, అష్టోత్తర నామావళితో పలు రకాల ఉదకాభిషేకాలు జరిపించారు. కళారాధనలో భాగంగా చిన్నారుల నృత్యాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి.

శ్రీశైలంలో సినీ దర్శకుడు అశ్విన్

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు అశ్విన్ దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి స్వామివారి గర్భాలయ స్పర్శదర్శనం చేసుకుని ప్రాంగణంలోని పరివార దేవతలను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి మంగళ హారతులు, తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

హైందవ ఆచారాలు ఆదర్శ ప్రాయం

- శ్రీశైల బ్రామరీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పూర్ణానంద
- క్షేత్రంలో బ్రాహ్మణ వన సమారాధన



వన సమారాధనలో పాల్గొన్న బ్రాహ్మణులు

శ్రీశైలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : హైందవ సంస్కృతిలో అనాదిగా వస్తున్న సాంప్రదాయాలను పాటించే ఆచార వ్యవహారాలు అందరికీ ఆదర్శనీయమైనవని శ్రీశైల బ్రామరీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, దేవస్థానం స్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు అన్నారు. మంగళవారం క్షేత్ర పరిధిలోని శ్రీ వేమనారాధ్య పీఠంలో బ్రాహ్మణ వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠంలో స్మార్థఆగమ అర్చక వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద భోజనాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల అపర కర్మలు చేసుకునేందుకు సరైన వసతులు లేకపోవడం బాధాకరమన్నారు. ఈ అంశంపై ఈవోకు అందించిన లేఖను దేవాదాయ ధర్మాదాయశాఖకు అందించుటకు సిద్ధమవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు జగదీష్, సత్యం, శాస్త్రి, వాసవీ, కరివేన సత్రాల మేనేజర్లు శ్రీధర్, సుబ్రహ్మణ్యం, రజనీకాంత్, ఆంజనేయశాస్త్రి, దావులూరి శంకర్, నగేష్‌స్వామి, భద్రయ్య, యోగిస్వామి, ప్రసాద్ తదితరులున్నారు.

చేపల పెంపకంతో జీవనోపాధి

వెలుగోడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు జలాశయంలో చేపల పెంపకంతో మత్స్యకారులకు జీవనోపాధి కలుగుతుందని ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వంగాల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో వెలుగోడు జలాశయంలో అధికారులు, టీడీపీ నాయకులు చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కట్ల, రోహో, బొచ్చ జాతులకు చెందిన చేప పిల్లలను విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్లాల క్రిష్ణుడు, అబ్దుల్‌కలాం, మండ్ల శంకరరెడ్డి, ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి, మత్స్యశాఖ ఏడీ రవికుమార్‌రెడ్డి, జేడీ హీరానాయక్, డిడి చంద్రశేఖర్, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలను వినియోగించుకోవాలి

కొత్తపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు సహకార పరపతి సంఘాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని నాగంపల్లి సహకార సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ సూచించారు. మంగళవారం కొత్తపల్లిలోని నాగంపల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో 72వ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని కార్యాలయ ఆవరణంలో సొసైటీ చైర్మన్ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ఇచ్చారు. ఆత్మకూరు కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ మహ్మద్ రసూల్, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ సురేంద్ర, హెచ్ఎం పురుషోత్తంరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రాధాకృష్ణారెడ్డి, సీఈవో శ్రీరాములు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వర స్వామి కల్యాణం



ఆత్మకూరులో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



పాణ్యంలో అగస్తీశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మాస శివరాత్రి సందర్భంగా స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా క్రతువులను అర్చకులు శరత్ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా సాగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణలో కొలువుతీర్చి కల్యాణం నిర్వహించారు. భక్తులతో పాటు అయ్యప్పదీక్షాపరులకు అల్పాహారం వితరణ చేశారు.

పాణ్యం: మండల కేంద్రంలోని అగస్తీశ్వరస్వామి ఆలయం (తెల్లగుడి)లో మంగళవారం అన్నపూర్ణ సమేత అగస్తీశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ, ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నంద్యాల కల్చరల్: పట్టణంలోని ప్రథమ నందీశ్వరాలయంలో కార్తీకమాసం మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం సాయంత్రం కేదారేశ్వరీదేవి సమేత ప్రథమనందీశ్వరస్వామి ఉత్సవమూర్తుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు ప్రవీణ్‌కుమార్, అన్నదాన కమిటీ సభ్యులు, చలం బాబు, నరశింహులు, భక్తులు పాల్గొన్నారు.



నంద్యాలలో కేదారేశ్వరీదేవి, ప్రథమనందీశ్వరస్వామి కల్యాణం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలి: కలెక్టర్

నంద్యాల టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు నైపుణ్యాభివృద్ధి కోసం కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం డ్వామా పీడీ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్కిల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలోని యువతకు చక్కని నైపుణ్య మెళకువలు అందించి ఉపాధి అవకాశాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కల్యాణి, జిల్లా పరిశ్రమల అధికారి మహబూబ్‌బాసా, జిల్లా నైపుణ్య అధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రౌండ్ వాటర్ అధికారి రఘురాం, డీపీవో లలితాబాయి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

సింగిల్ డెస్క్ విధానం ద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. పారిశ్రామికవేత్తల ద్వారా అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని డ్వామా కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ మొత్తం 686 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 652 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారన్నారు. మిగిలిన దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మహబూబ్‌బాసా, ఎల్డీఎం రవీందర్‌కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిశోర్‌రెడ్డి, డీపీవో లలితాబాయి, రవాణా శాఖ అధికారి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఆర్జీఎం విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న సీఐ కృష్ణమూర్తి

పాణ్యం/ ఆత్మకూరు/ బండిఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నంద్యాల ఎక్సైజ్ శాఖ సీఐ కృష్ణమూర్తి సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. నేటి యువత మత్తు పదార్థాలకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్, డైరెక్టర్ అశోక్‌కుమార్, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ సత్యప్రకాష్, ఈగిల్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మల్లికార్జున, శ్రీని వాసులు, మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆత్మకూరు అర్బన్ సీఐ రాము అవగాహన కల్పించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు జరిగితే డయల్ 100 లేదా టోల్ ఫ్రీ 14405 సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. అనంతరం యువతచే ప్రతిజ్ఞ చేయించారు. బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఐ జగన్మోహన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

అధునాతన వంగడాలు సాగు చేయాలి

బండిఆత్మకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు అధునాతన వరి వంగడాలను సాగుచేయాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం పెద్దదేవళాపురం, సంతజూటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ అధునాతన ఎన్ఎల్ఆర్, ఎంటీయూ వంగడాలు తెగుళ్ల బెడదను తట్టుకుని, అధిక దిగుబడులు ఇస్తాయన్నారు. తక్కువ ఖర్చులు, ఎక్కువ దిగుబడులు రాబట్టాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో నాగేశవ్వరరావు, వీఏఏలు యాసీర్ అర్ఫత్, ఆయేషా పాల్గొన్నారు.

మహానందిలో డీఎల్‌పీవో పూజలు

మహానంది, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మంగళవారం నంద్యాల డీఎల్‌పీవో లలితాబాయి ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయం వద్ద డిప్యూటీ ఎంపీడీవో కలువ భాస్కర్ స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో డీఎల్‌పీవో అభిషేకార్చన పూజలు చేశారు. అనంతరం నవనంది క్షేత్రాల్లో ప్రసిద్ధి గాంచిన గరడనందీశ్వరునికి జలాభిషేకం భక్తిశ్రద్ధలతో చేశారు.

అభ్యంతరాలు తెలియజేయాలి

పాములపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వేలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సులోచన సూచించారు. మంగళవారం మండలంలోని బానుముక్కల, బాణకచెర్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వామిత్వ సర్వేలో గృహాలు, ఖాళీ స్థలాలకు పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో కొలతలు పూర్తి చేశారన్నారు. ఏమైన సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కాల్వలోకి దూకిన వ్యక్తికి గాయాలు

నంద్యాలటౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో చామ కాల్వలోకి దూకిన వ్యక్తికి గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం భగత్‌సింగ్ కాలనీకి చెందిన వెంకన్న ఇంట్లో గొడవ పడ్డాడు. మందు తాగి మత్తులో సాయిబాబానగర్ చామకాల్వ బ్రిడ్జిపై నుంచి కాల్వలో దూకాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నీళ్ల తక్కువగా ఉండడంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

నందికొట్కూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని జీవనజ్యోతి సర్కిల్‌లో రైతులు ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల గోడు పట్టించుకోని వ్యవసాయ శాఖామంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు రామకృష్ణ, శ్రీరాములు, సోమన్న, రైతులు మహమ్మద్‌బాషా, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్గధామంలో కార్తీక దీపోత్సవం

నంద్యాల కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్గధామం (శ్మశానవాటిక)లో కార్తీక మాస దీపోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. నంద్యాల మున్సిపాలిటీ హిందూ శ్మశానవాటిక భీమవరం రస్తాలో ఉన్న స్వర్గధామం నందు 20అడుగుల ధ్యానముద్రలో వున్న శివుని విగ్రహం ముందు ఉసరి చెట్టు దగ్గరలో ఉత్తరాధిమఠం స్వామి సుదీంద్రాచార్యుల పర్యవేక్షణలో కార్తీకదీపోత్సవం చేశారు. కార్యక్రమంలో స్వర్గధామం అధ్యక్షులు మధుసూదనరావు, సభ్యులు నెరవాటి సత్యనారాయణ, గెలివి రామక్రిష్ణ, శేషుభాబు, కొమ్మహరి, చిత్తలూరి రామప్రసాదరావు, సముద్రాల పాండురంగయ్య, బచ్చు సత్య నారాయణ ఉన్నారు.

భక్తిలో ఆనందం

వెలుగోడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణభక్తిలో లౌకిక ఆనందం ఉంటుందని ప్రముఖ పురాన పండితులు శ్రీనివాస రామానుజదాసు అన్నారు. మంగళవారం రామాలయంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, రామలింగేశ్వరరెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ


పార్లమెంట్ స్టాడింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ బస్తిపాటి

కర్నూలు అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీపై న్యూఢిల్లీలో నిర్వహించిన పార్ల మెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. చైర్మన్ కనిమోళి కరుణానిధి అధ్యక్షతన సాగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పిల్లల ఉత్పత్తులు, ఇతర ఆహార పదార్థాల్లో చక్కెర కంటెంట్‌పై కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో చర్చించినట్లు ఎంపీ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


మంత్రి టీజీ భరత్‌కు వినతి పత్రం ఇస్తున్న కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో ప్రధాన పాత్ర పోషించిన సీఐ సతీశ్‌కుమార్ మృతిపై విచారణ జరిపి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కృష్ణమూర్తి, బజారప్ప, కేసీ నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన సతీష్‌కుమర్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించి రూ.2కోట్లు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. నాయకులు కే.బజారప్ప, రమేష్, లింగన్న, గిడ్డయ్య, కుమ్మరి సంఘం నేతలు ఉన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులతో..
మహిళ ఆత్మహత్యాయత్నం

నంద్యాల టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల వేధింపుతో గ్యాస్‌తో నిప్పంటించుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. డేనియాల్‌పురానికి చెందిన మరియదాస్, మేరి దంపతులు. భర్త డ్రైవర్‌గా హైదరాబాద్‌లో, భార్య మేరి పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. కొన్నిరోజుల క్రితం నంద్యాలకు చెందిన సుబ్బారెడ్డి అనే వడ్డీ వ్యాపారి వద్ద రూ.2.5లక్షలు అప్పు తీసుకున్నారు. దీంతో వడ్డీ కడుతున్న, వడ్డీతో పాటు అసలుకు రెట్టింపు ఇవ్వాలని ప్రతిరోజు ఇంటి వద్దకు వచ్చి వేధింపులకు గురిచేసేవాడు. మనస్థాపానికి గురైన మేరి గ్యాస్‌తో నిప్పంటించుకొని ఆత్మహ త్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంటలు రావడంతో బంధువులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నందాల్య రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫారం నెం 2లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ కుమారి మంగళవారం తెలిపారు. వివరాలు.. మృతి చెందిన వ్యక్తి గ్రీన్‌కలర్ టీషర్టు వేసుకొని ఉన్నాడు. వయస్సు సుమారుగా 40 నుంచి 45ఏళ్ల లోపు ఉండవచ్చు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీ ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గోనెగండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోదేపాడు గ్రామంలో బోయ మహేష్ ఇంటిపై దాడిచేసి 2014 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. వివరాలు.. పత్తికొండ ఎక్సైజ్ శాఖ వారికి బోదేపాడు గ్రామంలో కర్ణాటక టెట్రా ప్యాకెట్‌లు అక్రమంగా అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం అందింది. పథకం ప్రకారం ఎక్సైజ్ ఎస్ఐ సువర్ణలత, రాజేశ్, ఇంద్రకిరణ్‌తేజ్ బోదేపాడు చేరుకున్నారు. మహేష్ ఇంటిపై దాడిచేయగా 2014 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు ఇంట్లో లభించాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యంతో సంబంధం ఉన్న మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది రామకృష్ణ, రామచంద్రుడు, బషీర్, శాంతారాజు, అఫ్రోజ్, అయ్యన్న పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోటపాడుకు చెందిన మాదిగ ఓబులేశు(65) మూడు రోజుల క్రితం పేరుసోముల నుంచి కోటపాడుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. వెనుక వైపు నుంచి క్రేన్ వచ్చి ఢీకొట్టింది. ఓబులేశుకు తీవ్ర గాయాలు కాగా కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఓబులేశు మృతికి టీడీపీ నాయకులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.

యాత్రికుల అగచాట్లు

- అందుబాటులో లేని బస్సులు
- అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు వాహనాలు


ఆర్టీసీ బస్టాండ్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

శ్రీశైలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలకు అధిక సంఖ్యలో వచ్చిన యాత్రికులు తిరుగు ప్రయాణానికి అగచాట్లు పడుతున్నారు. ఆఖరి సోమవారం కావడంతో స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన వారంతా స్పర్శ దర్శనం చేసుకునే అవకాశం ఉంటుందనుకుని నిలిచిపోయారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన పలు డిపోల ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ప్రైవేటు వాహనదారులు కొందరు యాత్రికుల నుంచి రెట్టింపు చార్జీలకంటే అధికంగా వసూలు చేశారు. క్షేత్ర పరిధిలో ప్రతియేటా జరిగే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలతో బస్సు నడపాల్సిన ఆర్టీసీ నిర్లక్ష్యంపై యాత్రికులు అసహనం వ్యక్తం చేశారు.

లారీ ఢీకొని ముగ్గురి దుర్మరణం

- ఒకరికి గాయాలు
- కర్నూలులో నగరంలో ఘటన


లక్ష్మీనారాయణ (ఫైల్) | శ్రీనివాసులు (ఫైల్)

కర్నూలు క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో బళ్లారి చౌరస్తా కేశవ్ గ్రాండ్ హోటల్ ఎదురుగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ (50), వెంకటరామిరెడ్డి (48), శ్రీనివాసులు (48) దుర్మరణం చెందగా.. ఇంతియాజ్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కల్లూరు మండలం ఎ.గోకులపాడు చెందిన శ్రీనివాసులు లారీ ఓనర్. ఆయన లారీకి లక్ష్మీనారాయణ డ్రైవర్‌గా, వెంకట్రామిరెడ్డి క్లీనర్‌గా పని చేస్తున్నారు. ఈ లారీ దూర ప్రాంతాలకు వెళ్లి ఓ లోడుతో కర్నూలు శివారుకు వచ్చింది. అక్కడ అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తుంది. అయితే ఈ క్రమంలో లారీ టైర్లు అరిగిపోయాయని డ్రైవర్ చెప్పడంతో శ్రీనివాసులు టైర్ల విక్రేత ఇంతియాజ్‌ను పిలుచుకొని బళ్లారి చౌరస్తా సమీపానికి మంగళవారం రాత్రి వచ్చాడు. కొద్ది సేపటికే వీరి లారీ బళ్లారి చౌరస్తా ఫ్లై ఓవర్ నుంచి కిందకు దిగి ఫ్లైఓవర్ ఎండింగ్‌లో ఓ పక్కకు నిలబెట్టారు. ఓనర్ శ్రీనివాసులు, టైర్ల విక్రేత ఇంతియాజ్, లారీ డ్రైవర్ లక్ష్మీనారాయణ, క్లీనర్ వెంకట్రామిరెడ్డి కింద దిగి టైర్లను చెక్ చేసుకుంటున్నారు. ఇంతలో ఫ్లై ఓవర్ పై నుంచి వేగంగా ఓ లారీ దూసుకువచ్చి టైర్లు చెక్ చేసుకుంటున్న ఈ నలుగురిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ, వెంకట్రామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా.. శ్రీనివాసులు, ఇంతియాజ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. కొద్దిసేపటికే శ్రీనివాసులు మృతి చెందాడు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ కొద్ది దూరంలో పెట్టి లారీ డ్రైవర్ పరారయ్యాడు.

ముగ్గురి నేపథ్యం..

ఎ.గోకులపాడు చెందిన శ్రీనివాసులు తన భార్య లక్ష్మీదేవితో కలిసి మంగళవారం రాత్రి కర్నూలు వచ్చాడు. ఇంతలో లారీ వచ్చిన విషయం తెలియగానే భార్యను ఆటోలో ఎక్కించి ఇంటికి పంపించేశాడు. మరోసారి చూసుకోవచ్చులే ఇంటికి వెళ్దామని భార్య కోరినా టైర్లు అరిగిపోయాయి చూసుకోవాలంటూ కర్నూలులోనే ఉండిపోయాడు. ఆయనకు కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డ్రైవర్ లక్ష్మీనారాయణకు భార్య లక్ష్మీదేవి ఉంది. ఆయన స్వస్థలం వెల్దుర్తి మండలం రత్నపల్లె కాగా.. కల్లూరు రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. క్లీనర్ వెంకట్రామిరెడ్డికి భార్య, కొడుకు సంతానం ఉన్నారు. వీరు కూడా కర్నూలు నగరంలో నివాసం ఉంటున్నారు. బంధువుల రోదనలతో ఆసుపత్రి ప్రాంగణం మిన్నంటింది. ఇప్పటిదాకా తన వెంట ఉన్న భర్త కళ్ల ముందు విగతజీవిగా కనిపించడంతో శ్రీనివాసుల భార్య రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. శ్రీనివాసులు నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు.

ట్రూ అప్ పిటీషన్లపై విచారణ

- ఏపీఈఆర్సీ ఇన్‌చార్జి చైర్మన్ పీవీఆర్ రెడ్డి

కల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ ఏపీఎస్పీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్ దాఖలు చేసిన ట్రూఅప్ పిటీషన్లపై మంగళవారం విచారణ నిర్వహించింది. నగరంలోని దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న విద్యుత్ నియంత్రణ మండలి కమిషన్ హాల్లో ఇన్‌చార్జి చైర్మన్ పీవీఆర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏపీఈఆర్సీ- 2025 టారిఫ్ నిబంధనల ప్రకారం 2019-20 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ సప్లై బిజినెస్‌కు సంబంధించిన లెక్కలను పరిశీలించారు. ట్రూ-అప్, క్యారియింగ్ కాస్ట్, ఏపీఎస్పీడీసీఎల్-3760.14, ఏపీసీపీడీసీఎల్-2649.56, ఏపీఈపీడీసీఎల్-7797.82 మొత్తం రూ.14207.52కోట్లు కాగా అందులో ఇప్పటికే కమిషన్ అంగీకరించిన మొత్తం రూ.1435.56 కోట్లు నెట్ ట్రూ-అప్-12771.96 కోట్ల సర్దుబాటుపై కమిషన్ విచారణ నిర్వహించింది. ఈబహిరంగ విచారణలో పరిశ్రమల, వినియోగదారుల సంఘాలు, రాజకీయ ప్రతినిధులతో సహా పలువురు హాజరయ్యారు. మొత్తం 41అభ్యంతరాలు, సూచనలు కమిషన్‌కు దృష్టికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనంతరం డిస్కం ప్రతినిధులు తమ సమాధానాలను కమిషన్‌కు సమర్పించాయి. అందిన అభ్యంతరాలు, వాటికి సంబంధించిన సమాధానాలను కమిషన్ తన వెబ్‌సైట్‌లో ఉంచింది. విచారణలో రెండు వర్గాల వాదనలు విన్న తర్వాత తీర్పును పీవీఆర్.రెడ్డి రిజర్వ్ చేశారు.


వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై ప్రభుత్వం మోపనున్న మరో రూ.12771 కోట్ల బాదుడును ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్.బాబురావు డిమాండ్ చేశారు. దిన్నెదేవరపాడు ఏపీఈఆర్సీ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ చైర్మన్ పీవీఆర్ రెడ్డికి సీపీఎం జిల్లా కమిటీ తరుపున వినతిపత్రం అందజేశారు. తక్షణమే ట్రూఅప్, ఎఫ్‌పీపీసీఏ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేసి స్మార్ట్ మీటర్లు ఇళ్లకు అమర్చడాన్ని నిలిపివేయాలన్నారు. ఆదానీ సంస్థతో చేసుకున్న (ఎఫ్‌పిపిసీఏ) సోలార్ విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, టి.రాముడు, జిల్లా నాయకులు సీ.గురుశేఖర్, రాజశేఖర్, అలివేలమ్మ, సీహెచ్.రాజశేఖర్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొంతు నులిమి..
మామను హత్యచేసిన అల్లుడు

- కోసిగి మండలం దుద్ది గ్రామంలో ఘటన


గోవిందయ్య (ఫైల్)

కోసిగి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి మృగంగా మారాడు. మద్యం మత్తులో పిల్లనిచ్చిన మామనే గొంతు, చేతులపై కొరికి నులిమి అతి కిరాతకంగా హత్య చేశాడు ఓ అల్లుడు. ఈ ఘటన కర్నూలు జిల్లా కోసిగి మండలంలోని దుద్ది గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నట్లు సీఐ మంజునాథ్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన కింది గోవిందయ్య (45) అనే వ్యక్తి తన పెద్ద కూతురు వీరేశమ్మను చిన్న భూంపల్లికి చెందిన కొలిమి నరసింహులుకు ఇచ్చి పెళ్లి చేశాడు. ఈనెల 15వ తేదీన గోవిందయ్య తన కుటుంబ సభ్యుల్లో ఓ వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు అల్లుడు నరసింహులుతో కలిసి కోల్‌మాన్‌పేటకు వెళ్లారు. 16వ తేదీన మామ, అల్లుడి దుద్ది గ్రామానికి చేరుకున్నారు. 17వ తేదీ సాయంత్రం అల్లుడితో కలిసి మామ మద్యం సేవించాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి గోవిందయ్యను అల్లుడు నరసింహులు గొంతు, చేతిపై గట్టిగా కొరికాడు. గొంతు నులిమి అతి కిరాతకంగా హత్య చేశాడు. మృతుడి భార్య తిప్పమ్మ ఫిర్యాదు మేరకు నిందితుడు నరసింహులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: ఎస్పీ



రికార్డును పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. పట్టణంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, లాకప్ గదులను, రికార్డు రూమ్స్‌ను, రోస్టర్ డైరీ , నేరస్థుల రికార్డులను పలు దస్త్రాలను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ నేర చరిత్ర, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాత నేరస్థులు, నేర చరిత్ర కలిగిన వారు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలు ఆరా తీశారు. రాత్రి సమయంలో బీట్ పోలీసులు తప్పనిసరిగా తిరగాలని పలు సూచనలు చేశారు. ఎస్ఐ ప్రతాప్, ఏఎస్ఐ రఫీక్, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మారక పోతే చర్యలు

విధులకు గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహం


సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పనితీరు మారకపోతే చర్యలు తప్పవమని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి హెచ్చరించారు. మంగళవారం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అంటెండెన్స్‌ను రిజిస్టర్‌ను తనిఖీ చేసి, సీనియర్ అసిస్టెంట్ విధులకు డుమ్మా కొట్టడం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిస్కిప్షన్‌లో మాజీ సీఎం జగన్ ఫోటో ఉండటంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. సీనియర్ అసిస్టెంట్ మధుసుధన్ సంతకం చేయకుండా ఖాళీగా ఉండటంతో డాక్టర్ షఫీయా భేగంను ప్రశ్నించారు. ఆమె సమాధానం ఇవ్వకపోవడంతో ఎన్ని రోజుల నుంచి ఈ తతంగం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డాక్టర్ సీనియర్ అసిస్టెంట్ లీవ్‌లో ఉన్నారని తెలపగా, లివ్ లేటర్ ఎక్కడ అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలు లేక పోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మరో సారి తనిఖీ చేస్తాపని తీరు మారక పోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిల్లలను హత్య చేసిన
తండ్రికి జీవిత ఖైదు

కర్నూలు లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భార్య మీద అనుమానంతో ఇద్దరు పిల్లలను హత్య చేసిన తండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ కర్నూలు 7వ అదనపు జిల్లా న్యాయాధికారి మంగళవారం తీర్పు చెప్పారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లాకు చెందిన ధనోజీరావు గౌండా పని చేసేవాడు. నేరం జరగడానికి 15 సంవత్సరాల ముందు జ్యోతి అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు నిఖిత (7), మధుచరణ్ (4). అయితే ధనోజీరావు తన భార్య మీద ఉన్న అనుమానంతో తరుచూ ఆమెతో గొడవపడేవాడు. భార్య ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఇద్దరు పిల్లలను హత్య చేసి తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇద్దరు పిల్లలను గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. ధనోజీరావు కూడా కరెంటు వైరుతో ఉరి వేసుకునేందుకు ప్రయత్నించగా.. ఆ వైరు తెగిపోవడంతో బతికాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. ధనోజీరావు అత్త ఫిర్యాదు మేరకు జూపాడుబంగ్లా పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. కేసును విచారించిన పోలీసులు నిందితుడిపై కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరళాదేవి వాదించారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

తల్లీ బిడ్డలను బతికించడానికి శాయశక్తులా ప్రయత్నించారు: డీసీహెచ్ఎస్


మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి మంగళవారం సాధారణ తనిఖీలో భాగంగా ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించామన్నారు. నందవరం మండల పరిధిలోని మూగతి గ్రామానికి చెందిన మౌనిక (21) శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవానికి రావడం, కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ తల్లీబిడ్డలు మరణించడం గురించి అడగగా.. డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా సమాధానమిచ్చారు. 100 పడకల ఆసుపత్రిలో నెలకు 400 పైగా కాన్పులు చేస్తూ ప్రతి ప్రాణాన్ని కాపాడడానికి డాక్టర్లు కృషి చేస్తున్నారని, మౌలికను, బిడ్డను కాపాడటానికి వైద్యులు శాయశక్తులా ప్రయత్నించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆది నాగేష్, డాక్టర్ సుధా, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ ఫర్నిచర్ వేలానికి ఆదేశం

కర్నూలు లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తుండటంతో కర్నూలు ఆర్డీవో కార్యాలయంలోని ఫర్నిచర్‌ను వేలం వేయడానికి 6వ అదనపు న్యాయాధికారి పి.వాసు మంగళవారం ఆదేశాలు జారీచేశారు. స్థానిక ఈ.తాండ్రపాడు సమీపంలో రైల్వేపోర్టు ఫ్యాక్టరీ నిర్మాణానికి 2015లో ప్రభుత్వం రైతుల నుంచి భూములను సేకరించింది. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం తక్కువగా నిర్ణయించడంతో 46 మంది రైతులు కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ప్రభుత్వం నష్టపరిహారంగా రైతులకు అధిక రేటును నిర్ణయిస్తూ తీర్పుచెప్పింది. 2021లో కర్నూలు కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ఆతర్వాత హైకోర్టు కర్నూలు కోర్టు నిర్ణయించిన నష్టపరిహారంలో 50శాతం మొత్తాన్ని 8వారాల్లోగా కోర్టులో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఈఆదేశాలను అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడంతో కర్నూలు కోర్టు కేసును విచారించి 46 మంది రైతుల నష్టపరిహారం మొత్తం రూ.53,22,27,315లను వెంటనే చెల్లించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. కలెక్టర్ ప్రభుత్వానికి ఈవిషయంపై నివేదించారు. నష్టపరిహారం చెల్లించకపోవడంతో బాధితులు కర్నూలు ఆర్డీవో కార్యాల య ఫర్నిచర్‌ను వేలం వేసి తమకు నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా కర్నూలు కోర్టును కోరారు. దీంతో కర్నూలు ఆర్డీవో కార్యాలయంలోని ఫర్నిచర్‌ను వేలం వేయాలని ఆదేశిస్తూ కేసును డిసెంబరు 2వ తేదీకి వాయిదా వేశారు. ఆతేదీలోపు నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయాధికారి ఆదేశించారు.

టౌన్ ప్లానింగ్ అధికారులపై విచారణకు ఆదేశాలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులపై విచారణ చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్ నగర పాలక కమిషనర్ పి. విశ్వనాథ్‌కు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని రాఘవేంద్రనగర్‌కు చెందిన వై. పూర్ణ కల్లూరు పరిధిలో ఉన్న తనపట్టా స్థలానికి ఇంటి పన్ను వేయాలని 2022లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే అప్పటి నుంచి అధికారులు ఇంటికి పన్నువేయకుండా వేధిస్తున్నారు. అప్పటి నుంచి ఆమె సేకరించిన ఆధారాలను జతపరుస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, కలెక్టర్, ఏపీ లోకాయుక్త, ఏసీబీ డైరెక్టర్ విజయవాడ, మానవ హక్కుల కమిషన్, రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలకు లేఖ రాసింది. దీంతో స్పందించిన మున్సిపల్ శాఖ డైరెక్టర్ తక్షణమే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులపై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

వృద్ధుడి బలవన్మరణం

కొలిమిగుండ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకొని ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో మంగళవారం చోటుచేసుకున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన సీతారామాంజనేయులు(62) అనే వృద్ధుడికి వివాహం కాలేదు. తన సోదరుడు రామలింగం కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స పొందుతున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

5వ పేజీ తరువాయి

అయితే కేంద్ర బృందం సభ్యులు తెలుగులో మాట్లడకపోవడం, రైతులకు హిందీ, ఇంగ్లీష్ రాకపోవడంతో రైతులు చెప్పే సమస్యలు అర్థం చేసుకోవడానికి కేంద్ర బృందం సభ్యులు కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్యాలకుర్తిలో మోహిద్దీన్ అనే రైతు ఉల్లి సాగు కష్టాలను హిందీలో వివరించారు. ఉల్లి పంటను ఎప్పటి నుంచి సాగు చేస్తున్నారు..? ఏ సీజన్‌లో.. ఎలాంటి రకాలు సాగు చేస్తున్నారు..? మార్కెట్ ధరలు ఎలా ఉన్నాయి..? కోల్డ్ స్టోరేజ్ గోదాములు అందుబాటులో ఉన్నాయా..? ఉల్లి సాగులో ఎదురవుతున్న సమస్యలు, ఎకరాకు సాగు ఖర్చు, మార్కెట్ ధరలు.. వంటి వివరాలను కేంద్ర ఉద్యాన మంత్రిత్వశాఖ డిప్యూటీ కమిషన్ డాక్టర్ బీజే బ్రహ్మ రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఇలా వచ్చారు.. అలా వెళ్లారు

కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి కేంద్ర బృందం

సర్వం కోల్పోయాం

సాయంత్రం 3.20 గంటలకు వచ్చారు. అప్పటికే జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు రప్పించిన రైతులలో కేవలం ముగ్గురితో ఓ అర గంట మాట్లాడి వెళ్లిపోయారు. అక్కడి నుంచి గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామానికి 4.15 గంటలకు చేరుకున్నారు. అక్కడ కేవలం పది నిమిషాలు ఇద్దరు రైతులతో మాట్లాడారు. 4.35 గంటలకు గోనెగండ్లకు చేరుకొని ఐదు నిమిషాలు ఓ రైతుతో మాట్లాడారు. అక్కడి నుంచి కర్నూలుకు వెళ్లిపోయారు. కేంద్ర బృందం కేవలం 1.15 గంటల పర్యటనలో రైతులతో 40-45 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. అది కూడా రోడ్డు పక్క గ్రామాల్లో మాత్రమే ఉల్లి రైతులను పలకరించారు. అత్యధికంగా ఉల్లి సాగు చేసే శివారు మండలాలు సి. బెళగల్, దేవనకొండ, కోసిగి.. వంటి మండలాలకు వెళ్లలేదు. ఇలా వచ్చి.. అలా వెళ్లిపోతే రైతుల కష్టాలు ఏం తెలుస్తాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. నేడు కర్నూలు మార్కెట్ యార్డులో కేంద్ర బృందం పర్యటిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



సర్వీసు రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డ శివారులోని జాతీయ రహదారిపైన ఉన్న దోస హౌస్, టిడ్కో గృహాల సముదాయం, అహోబిలం బైపాస్ రోడ్లకు వెళ్లే సర్వీస్ రహదారిని డీఎస్పీ ప్రమోద్, సీఐ యుగంధర్, హైవే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, చర్యల గురించి చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ తాలుకాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా వాహనదారులకు అవగాహన లేక జరుగుతున్నాయన్నారు. చాలా మంది రాంగ్ రూట్‌లలో వెళ్లడం వల్ల, సర్వీస్ రోడ్డు లేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



బనగానపల్లెలో చెస్ పోటీలను పరిశీలిస్తున్న టంగుటూరు శీనయ్య, గ్రంథాలయ సిబ్బంది

బనగానపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. మంగళవారం బనగానపల్లె శాఖ గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంపై చిత్ర లేఖనం, చెస్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మధుశేఖర్, సిబ్బంది గీతామాధురి, శరత్‌బాబు, జంగంశెట్టి, జక్కానాగరాజు, సాయిరాం, సుబ్రహ్మణ్యం, శ్రావణ్, పాఠకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బాలతిమ్మా రెడి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి, గిద్దలూరు గ్రంథాలయాధికారి మద్దిలేటి న్నారు.

చాగలమర్రి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండగారాలని గ్రంథాలయాధికారి రామచంద్రుడు అన్నారు. మంగళవారం చాగలమర్రి భారతీ విద్యామందిరంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, కాంతారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డవాగు వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు



అడ్డవాగును పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ ఏఈ

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని గోపాయపల్లె రహదారిలో అడ్డవాగు వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు మైనర్ ఇరిగేషన్ ఏఈ రాంప్రసాద్ తెలిపారు. 'సాగుకు.. వాగు దాటాల్సిందే' అన్న శీర్షిక మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు అడ్డవాగును పరిశీలించారు. అడ్డవాగు వంతెన ఏర్పాటుకు అంచనా వేశారు. అడ్డవాగు వరద నీటి ప్రవాహం, సాగు భూముల వివరాల గురించి ఏఈ అడిగి తెలుసుకున్నారు. వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని ఆయన తెలిపారు.

గండి పూడ్చివేత

రుద్రవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.లింగందిన్నె గ్రామ సమీపంలో 'టీజీపీ బ్లాక్ చానల్‌కు గండి' అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో నవంబరు 14న ప్రచురితమైంది. తెలుగుగంగ అధికారులు స్పందించారు. గండికి ఇసుక సంచులతో మరమ్మతులు చేయించినట్లు ఏఈ వినయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గండికి మరమ్మతులు చేయడంతో రైతులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



గండిని పూడుస్తున్న కూలీలు

అడ్మిషన్లు ప్రారంభం

డోన్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల కోసం ఈ నెల 17 నుంచి 24వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగు తున్నాయన్నారు. ఇంటర్ ఉత్తీర్ణత అయిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఎమ్మార్సీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ఎమ్మార్సీ భవన నిర్మాణానికి స్థలాన్ని మంగళవారం ఎంపీడీవో తాహిర్ హుసేన్, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, ఈవో తారకేశ్వరి పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం వద్దగల స్థలాన్ని పరిశీలించి భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. భవన నిర్మాణం కోసం రూ.52 లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో భవన పనులు చేపడతామని అన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక రామలింగేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా మంగళవారం వేదపండితులు చిన్నశాస్త్రి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదారులచే పార్వతిపరమేశ్వరుల విగ్రహాలతో కల్యాణోత్సవం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విష్ణుసహస్ర పారాయణం

చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం మహిళలు సామూహికంగా విష్ణుసహస్ర పారాయణం వైభవంగా నిర్వహించారు. అనంతరం శివ పార్వతులకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ప్రారంభం



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కోట్ల రాఘవేంద్ర రెడ్డి

బేతంచెర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకలాపురం గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా మంగళవారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే కోట్ల తనయుడు, టీడీపీ యువ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో ఆరు జతల ఎద్దులు పాల్గొన్నారు. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్ ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచి రూ.30వేలు, తెలంగాణ రాష్ట్రం వనపర్తి మండలం రేపల్లె గ్రామానికి చెందిన రవీంద్రరెడ్డి ఎద్దులకు రెండో విజేతగా నిలిచి రూ.25వేలు, యనకండ్ల గ్రామానికి చెందిన బడే సాహెబ్, సి.బెళగల్ గ్రామానికి చెందిన విజయభాస్కర్ ఎద్దులు మూడో విజేతగా నిలిచి రూ.20వేలు, పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీరం శేషారెడ్డి ఎద్దులు నాలుగో విజేతగా నిలిచి రూ.15వేలు, బేతంచెర్ల గ్రామానికి చెందిన మేకల భానుజా, కొత్తూరు గ్రామానికి చెందిన బీరం శేషారెడ్డి ఎద్దులకు 5వ విజేతగా నిలిచి రూ.10వేలు, నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి జనార్దన్ రెడ్డి ఎద్దులు 6వ విజేతగా నిలిచి రూ.5వేలు నగదు బహుమతి అందుకున్నారు.

ముగిసిన నయనాలప్ప ఉత్సవాలు

హోరాహోరీగా ఎద్దుల బలప్రదర్శన



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

సంజామల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నయనాలప్ప ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. నాలుగు పండ్ల విభాగానికి చెందిన ఎద్దుల పోటీలు హోరాహోరీగా సాగాయి. రాష్ట్ర నలుమూలల నుండి 14 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. కడప జిల్లా చెన్నూరుకు చెందిన సాయికుమార్‌రెడ్డి ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన అంజయ్య చౌదరి ఎద్దులు తృతీయ స్థానంలో కడప జిల్లా పెద్దముడియం మండలం పాలూరుకు చెందిన వెంకట హేమంత్‌రెడ్డి ఎద్దులు, నాల్గవ స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కృష్ణాపురానికి చెందిన పృథ్విరాజ్ ఎద్దులు, ఐదో స్థానంలో నంద్యాల జిల్లా సంజామల మండలం నొస్సంకి చెందిన కొనిదెల హరినాథ రెడ్డి ఎద్దులు, ఆరవస్థానంలో కడప జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన బీగారి నరేష్ ఎద్దులు విజేతలుగా నిలిచాయి. వీరికి వరుసగా రూ. 30వేలు, రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు, రూ. 5వేలు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు అధిక సంఖ్యలో రైతులు క్షేత్రాన్ని చేరుకొని ఎద్దుల బలప్రదర్శనను తిలకించారు. నయనాలప్ప ఉత్సవాల సందర్భంగా అక్కంపల్లె కొండల్లో వెలిసిన ఓం కారేశ్వర సన్నిధికి కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి భారీగా భక్తులు క్షేత్రానికి చేరుకోవడం ఆనవాయితీ. అత్యధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకున్న వారికి సౌకర్యాలు కల్పించడంలో ఆలయ ఈవో విఫలమయ్యారని భక్తులు ఆగ్రహించారు. క్యూలైన్‌లో గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

పనులను వేగవంతం చేయాలి

● ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



అండర్ డ్రైనేజీ సీసీ రోడ్ల పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలో పర్యటించి సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులను పర్యవేక్షించారు. కూటమి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జుర్రేరువాగు వద్ద నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించి బస్సుల రాకపోకలపై మంత్రి ఆరాతీశారు. మంత్రి వెంట డీఈలు నాగశ్రీనివాసులు, మధుసూదన్, ఏఈ సాయికృష్ణ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, భానుముక్కల సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్‌కలాం, రహీంనాయక్, బొబ్బల మద్దిలేటిరెడ్డి, గణమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమాన్ని గాలికొదిలేశారు'

బేతంచెర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని పాలకులు గాలికొదిలేశారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం బేతంచెర్లలోని మురళీధర్ రెడ్డి ఫంక్షన్ హాలులో జరిగిన సీఐటీయూ జిల్లా మూడో మహాభ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ కుమార్, ఏసురత్నం, నాగరాజు, కోశాధికారి తిరుప తయ్య, టి.శ్రీనివాసులు, షేబారాణి, కే.శివరాం, జి.నాగమణి, ఎం.నిర్మల పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల పని తీరు భేష్

ఎస్‌బీఐ డీజీఎం హేమ



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న డీజీఎం హేమ

ఆళ్లగడ్డ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన స్టేట్ బ్యాంక్‌లో మహిళా ఉద్యోగుల పని భేష్ అని డిప్యూటీ జనరల్ మేనేజర్ వీ.హేమ అన్నారు. మంగళవారం ఆమె ప్రధాన స్టేట్‌బ్యాంక్‌ను తనిఖీ చేశారు. బ్యాంక్ పురోగతిపై బ్యాంక్ మేనేజర్ ఇమ్రాన్ మహమ్మద్, సిబ్బందితో చర్చించారు. అనంతరం బ్యాంక్ పరిధిలో అధిక లావాదేవీలు సాధించిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం బ్యాంక్ రికార్డులను పరిశీలించారు. బ్యాంక్ ఫీల్డ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

దొర్నిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన దుర్వేసి నాగేంద్ర కొద్దిరోజుల క్రితం చింతకుంట గ్రామం వద్ద ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతి చెందాడు. నాగేంద్రకు టీడీపీ సభ్యత్వ నమోదు ఉండటం వలన ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు చెక్కును మృతుడి భార్య లక్ష్మికి మంగళవారం టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అందజేశారు. టీడీపీ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికి ప్రమాదవశాత్తు ఏదైన జరిగితే వారి కుటుంబానికి టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. ఈసందర్భంగా సీఎం చంద్రబాబు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించం

ప్యాపిలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లలను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షిం చమని ఎంపీడీవో శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని అలేబాదు గ్రామంలోని అంగనవాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా అందించాలన్నారు. కేంద్రంలో బోగస్ పిల్లల పేర్లు నమోదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, సర్పంచు హరికుమార్ పాల్గొన్నారు.

సర్వేపై అభ్యంతరాలు తెల్పండి

కొలిమిగుండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఇప్పటికే పూర్తయిన సామిత్వ సర్వేపై అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కొలిమిగుండ్ల ఎంపీడీవో దస్తగిరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మదనంతపురం గ్రామంలో స్వామిత్వ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ కార్యక్ర మంలో పంచాయితీ కార్యదర్శి సురేష్,తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

గోల్డ్ అప్రైజర్ చేతివాటం

● ఖాతాదారుల పేర్ల మీద నకిలీ బంగారం తాకట్టు

● బ్యాంక్ వద్ద బాధితుల ఆందోళన

● ఆరేళ్లుగా హోల్డ్‌లో అకౌంట్లు



బ్యాంక్ అధికారులతో వాగ్వాదానికి దిగిన ఖాతాదారులు

అవుకు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ గోల్డ్ అప్రైజర్(బంగారు ఆభరణాల మూల్యాంకన నిపుణుడు) చేతివాటం ప్రదర్శించాడు. ఖాతాదారుల పేర్ల మీద నకిలీ బంగారం తాకట్టుపెట్టి డబ్బులు తీసుకున్నాడు. ఈవిషయం బయటకు రావడంతో మండలంలోని రామాపురం యూనియన్ బ్యాంక్ వద్ద ఖాతాదారులు మంగళవారం ఆందోళనకు దిగారు. గతంలోని ఆంధ్ర బ్యాంక్ యూనియన్ బ్యాంక్‌లో విలీనం కాక ముందు అనగా 2019లో బ్యాంక్‌లో పనిచేస్తున్న గోల్డ్ అప్రైజర్ ప్రదర్శించిన చేతివాటం ఖాతాదారులకు శాపంగా మారింది. అప్పటి గోల్డ్ అప్రైజర్ శ్రీనివాసులు బ్యాంకులోని 19 మంది ఖాతాదారుల పేరుమీద నకిలీ బంగారం తాకట్టుపెట్టి డబ్బులు తీసుకున్నాడు. ఖాతాదారుల పేరుతో నకిలీ బంగారం తాకట్టులో ఉండటంతో బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు రామాపురం, చనుగొండ్ల, అవుకు, శింగనపల్లి గ్రామాలకు చెందిన ఖాతాదారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. గతంలో జరిగిన బ్యాంక్ అధికారుల ఆడిట్‌లో గోల్డ్ అప్రైజర్ బండారం వెలుగుచూడటం సంచలనంగా మారింది. ఖాతాదారులకు తెలి యకుండా బ్యాంక్‌లో పనిచేస్తున్న గోల్డ్ అప్రైజర్ నకిలీ బంగారం తాకట్టు పెట్టినట్లు బయ టపడింది. అయినప్పటికీ ఆరేళ్లుగా బాధిత ఖాతాదారుల అకౌంట్లను బ్యాంక్ అధికారులు హోల్డ్‌లో ఉంచారు. బ్యాంక్‌లో ఖాతాదారులు లవాదేవీలు చేసుకొనే అవకాశం లేకపోటంతో ఇబ్బందులు పడుతూ వచ్చారు. సహనం కోల్పోయిన ఖాతాదారులు బ్యాంక్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. బ్యాంక్‌కు తాళాలు వేసి నిరసనకు దిగారు. బ్యాంక్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని హోల్డ్‌లో ఉంచిన అకౌంట్లను రిలీజ్ చేయాలని బాధిత ఖాతాదారులు కోరుతున్నారు.

శివాలయంలో కార్తీక దీపోత్సవం

డోన్ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాంబశివాలయంలో మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు కల్లె శేషావలి శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాస దీపోత్సవం ముగింపు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నంద్యాల శంకర్ శర్మ, సంఘం కార్యదర్శి శ్రీధర్ బట్టులు హాజరై పూజలు చేశారు. న్యాయవాది నాగభూషణంరెడ్డి, కల్లె గంగాధర్ శర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఎస్ఐ

కోవెలకుంట్ల, నవంబరు 18(ఆంధజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఎస్ఐ వాహనాలను తనిఖీ చేసి, సర్టిఫికెట్లు, హెల్మెట్లు లేనివారికి జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రైతులు సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఈవోలు మంజుల, రేవతి అన్నారు. మంగళవారం మల్లేవేముల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. రబీలో సాగు చేసిన పంటలపై సూచనలిచ్చారు. 24 వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు.

నేడు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు శిక్షణ

చాగలమర్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కార్యదర్శులకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో తాహిర్‌హుసేన్ తెలిపారు. 21న శెట్టివీడులో హరితరాయబారులు, గ్రీన్‌కార్డుదారులకు పచ్చదనం పరిశుభ్రత, 26న ఎంపీడీవో కార్యాలయంలో పొదుపు మహిళలకు శిక్షణ ఉంటుందని అన్నారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

ఆళ్లగడ్డ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన వై అఖిల్ ప్రకాష్ జాతీయ స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌కి ఎంపి కైనట్లు కోచ్ రమణ తెలిపారు. మంగళవారం తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనపరిచిన అఖిల్ ప్రకాష్‌ను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అభినందించారు.

కార్మికులను ఆబ్కాస్‌లో చేర్చండి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ కౌన్సిలర్ సుంకన్న, కార్మికులు

డోన్ టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపాలిటీలో శానిటేషన్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న 20 మంది కార్మికులను ఆబ్కాస్‌లో చేర్చాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌కు కార్మికులతో కలిసి సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య మంగళవారం వినతిపత్రం అందజేశారు. చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ కౌన్సిల్‌లో తీర్మాణం చేసి సీడీఎం ఏకు పంపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, కౌన్సిలర్లు ఆర్షు రమణ, నాగేంద్ర పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి పడిపూజ



పూజల్లో పాల్గొన్న సీఐ రమేష్‌బాబు, అయ్యప్ప మాలధారులు

కొలిమిగుండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. సీఐ రమేష్ బాబు దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల, పేట్నికోట, కనకాద్రిపల్లె గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పడి పూజలో పాల్గొని, భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాములు జయరాంయాదవ్, చంద్ర మౌలి గౌడు, గొంగటి హుస్సేన్‌రెడ్డి, గోపాల్, నాగరాజు, దస్తగిరి, మధు, నాగరాజు, పోలీసులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు: ఎక్సైజ్ సీఐ

శిరివెళ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్‌శాఖ ఆళ్లగడ్డ డివిజన్ సీఐ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఇంద్రావతి, వైస్ ప్రిన్సిపాల్ జనార్దనుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోవెలకుంట్ల ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ సందీప్ సూచించారు. మంగళవారం నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామలింగారెడ్డి, మద్దిలేటిస్వామి, ఎక్సైజ్ సిబ్బంది హనుమంతు, వెంకటసుబ్బయ్య, రమేశ్, జగదీశ్వరి పాల్గొన్నారు.

రుద్రవరం: విద్యార్థులు మత్తుకు బానిస కావొద్దని ఎస్సై మహ్మద్‌రఫి, హెచ్‌ఎం వెంకటరమణ అన్నారు. మంగళవారం రుద్రవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. క్రార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం రాత్రి కోవెలకుంట్ల పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఎస్ఐ సందర్శించి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. హెడ్‌కానిస్టేబుల్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి సూచించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కిషోర్ ఆధ్వర్యంలో పట్టణంలోని అనంత డిగ్రీ, ప్రజ్ఞా కళాశాలల్లో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. శానిటరీ కార్యదర్శులు అరుణ్, సూర్యం, కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత ముందుకు రావాలని ఎస్ఐ మధుసూదన్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు నవీన్‌పాటి, రామక్రిష్ణయ్య, ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: చెడు వ్యసనాలకు దూరం గా ఉండాలని డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ సోమశేఖర్ రావు అన్నారు. మంగళవారం డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థా లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శిరివెళ్లలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్



కోవెలకుంట్లలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ



ప్యాపిలిలో..